క్లుప్తంగా

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం, గరుడసేవ నిర్వహించారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యేను ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రెటరీ కల్వ హరికృష్ణ, మనోహర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అండర్ డ్రెయినేజీ నిర్మాణానికి కృషి



వెల్దండ: అండర్ డ్రెయినేజీ నిర్మాణానికి కృషి చేస్తానని కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దాపూర్‌లో అండర్ డ్రెయినేజీ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏళ్లుగా డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉండేదన్నారు. సమస్యను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ. 5లక్షల నిధులను మంజూరు చేశారన్నారు. దీంతో కాలనీలో అండర్ డ్రెయినేజీ పనులను చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, ఆంజనేయులు, అనిల్, రాములు, సుధాకర్, కృష్ణయ్య, రవీందర్‌గౌడు, శివ, దనుష్ తదితరులు ఉన్నారు.

ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు



కల్వకుర్తి టౌన్: పట్టణ ప్రజలు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలని లేనిపక్షంలో మున్సిపాలిటీ నూతన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ హెచ్చరించారు. పట్టణంలోని పలువురికి ఆస్తి పన్నులను చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీచేసిన యజమానులు పట్టించుకోకపోవడంతో మంగళవారం వారి ఇంటి నల్లా కనెక్షన్‌ను తొలగించారు. ఇంకా చాలామంది పాత బకాయిలు పేరుకుపోయాయని, వాటిని సకాలంలో చెల్లించకుంటే ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఆస్తిపన్ను చెల్లించిన తర్వాత తిరిగి నల్లా కనెక్షన్‌ను తిరిగి మున్సిపల్ సిబ్బంది పునరుద్ధరించారు. మున్సిపల్ మేనేజర్ రాజకుమారి ఇంటింటికి తిరుగుతూ ఆస్తిపన్ను వసూలును పరిశీలించారు. మున్సిపల్ వార్డు ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

మైదానం వసతులపై ఆరా



పెంట్లవెల్లి: మండలంలోని కొండూరులో హైస్కూల్‌లో ఉన్న క్రీడా మైదానాన్ని బుధవారం అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోలపోగుల స్వాములు, కొండూరు మాజీ సర్పంచ్, నల్లపోతుల గోపాల్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో భవిష్యత్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల నిర్వహణ కోసం జిల్లా అసోసియేషన్ నుంచి ఆ పాఠశాలను సందర్శించారు. పోటీల నిర్వహణకు మౌలిక వసతులు, సదుపాయాల గురించి ఆరా తీశారు. గ్రామంలోని నాయకులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నల్లపోతు గోపాల్, కుమారస్వామి, సురేష్, మోహన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గడ్డి వాము దగ్ధం

చారకొండ: గడ్డివాము దగ్ధమైన ఘటన బుధవారం మండలంలోని ఎర్రవల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పబ్బు నాగయ్య గౌడ్ వ్యవసాయ పొలంలో గడ్డివాము ఏర్పాటు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు అంటించడంతో పూర్తిగా కాలి బుడిదైంది. పక్కనే ఉన్న పశువులను కాపాడారు. రూ.70 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.





కోడేరు ఉమామహేశ్వరాలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



తాడూరు మండలం ఐతోల్‌లో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న మహిళలు



వెల్దండలో శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

శంభో శంకర

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బుధవారం మహా శివరాత్రి పర్వదినం నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి శివాలయాలు భక్తులతో కిటికిటలాడాయి. శివలింగానికి అభిషేకాలు చేసి భక్తులు తరించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎర్రగడ్డ కాలనీలోని సుబ్రమణ్యేశ్వర దేవాలయం, మార్కెట్ యార్డు శివాలయం, శివాంజనేయ దేవాలయం, రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మార్కెట్‌లోని శివాలయంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సబిత కుటుంబ సమేతంగా అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

■ తాడూరు మండలంలోని ఐతోల్ శివాలయ ఆవరణం శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

■ కల్వకుర్తి పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయం, కన్యకా పరమేశ్వరి దేవాలయం, హనుమాన్ దేవాలయం ప్రాంగణాల్లో భక్తుల సందడి నెలకొంది. కైలాసంగుట్టపై మహా శివుడికి అభిషేకాలు నిర్వహించారు. భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి శివుడికి అభిషేకం చేశారు.

■ పెద్దకొత్తపల్లి శివాలయంతో శివలింగానికి జలాభిషేకం చేశారు. ఆంజనేయ స్వామి దేవాలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, మార్కండేయ దేవాలయం, దేవల్ తిర్మలాపూర్‌లోని శివాలయాలకు భక్తులు తరలివచ్చారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

■ బిజినేపల్లి మండలంలో భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. మమ్మాయిపల్లిలో మార్కండేయ ఆలయం చుట్టూ ఎద్దుల బండ్లను ఊరేగించారు. వెల్గొండలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు.

■ తిమ్మాజిపేటలోని శివరామాంజనేయ స్వామి ఆలయం, మారేపల్లిలో శివాలయం, నేరళ్లపల్లి, ఆవంచ, చేగుంట తదితర గ్రామాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

■ బల్మూర్ మండలంలోని కొండనాగుల, బల్మూర్, కొండారెడ్డిపల్లి, గట్టుతుమ్మెన్, మైలారం, బాణాల, గోదల్, జినుకుంట, మహాదేవ్‌పూర్ శివాలయాల్లో, పెద్దగుడిబండి రామలింగేశ్వరాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

■ కోడేరు మండల కేంద్రంతో పాటు రాజాపూర్, జనుంపల్లి, తీగలపల్లి, నర్సాయిపల్లి, మైలారం, కొండ్రావుపల్లి తదితర గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. కోడేరులో వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండోరోజు గణపతిపూజ, అవాహిత సర్వదేవత పూజ, అభిషేకాలు, బిల్వార్చన, అలంకారం, రుద్రహోమం, ఆరాధన, మహామంగళహారతి, తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయంలో నాటక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వరాలయంలో హోమం నిర్వహించారు.

■ అమ్రాబాద్ అమరేశ్వరాలయంతో పాటు పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి, కేదారేశ్వరాలయం తదితర ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

■ బిజినేపల్లి మండలంలో భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. మమ్మాయిపల్లిలో మార్కండేయ ఆలయం చుట్టూ ఎద్దుల బండ్లను ఊరేగించారు. వెల్గొండలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు.

■ తిమ్మాజిపేటలోని శివరామాంజనేయ స్వామి ఆలయం, మారేపల్లిలో శివాలయం, నేరళ్లపల్లి, ఆవంచ, చేగుంట తదితర గ్రామాల్లో శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

■ ఉప్పునుంతల మండలంలోని మామిళ్లపల్లి, ఉప్పునుంతల, పెనిమిళ్ల తదితర గ్రామాల్లో శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. తిప్పాపూర్‌లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం జరిపించారు.

■ లింగాల మండల కేంద్రానికి సమీపంలో చెన్నంపల్లి వెళ్లే మార్గంలో ఉన్న శివాలయంలో శివ పార్వతుల కల్యాణం, హోమాలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేపట్టారు.

■ చారకొండ మండలంలోని జూపల్లి, చారకొండ, సిర్సనగండ్ల తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కనక దుర్గ దేవాలయంలో పార్వతిపరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు.

■ వెల్దండ మండలంలోని గుండాలలో అంబా రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కల్వకుర్తి కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శివలింగానికి అభిషేకం చేశారు. టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు జక్కుల చిన్న జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. మండల కేంద్రంలోని శివుని గుట్టపై శివపార్వతుల కల్యాణం నిర్వహించి అన్నదానం చేశారు.

■ పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, గోపులాపూర్, పెంట్లవెల్లి, మాధవస్వామినగర్ గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంచాలకట్ట గ్రామంలోని కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు. బురదమట్టితో శివలింగాలు తయారుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కళాకారులతో కోలంట్ల కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిర్వహించారు.

■ తెలకపల్లి, మన్ననూరులో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.



నాగర్‌కర్నూల్ సుబ్రమణ్యేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డు శివాలయంలో క్యూలైన్‌లో నిలబడిన భక్తులు



గుండాలలో అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



తెలకపల్లిలో..



పెంట్లవెల్లి మండలం మంచాలకట్టలో..



బల్మూర్ కొండనాగుల పెద్దగుడిబండ ఆలయంలో..




తిమ్మాజిపేటలో ..



చారకొండ మండలం సిర్సనగండ్లలో



గుండాల కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు



బిజినేపల్లి మండలం మమ్మాయిపల్లి గ్రామంలో మార్కండేయ శివాలయం వద్ద వాహనాల ఊరేగింపు



తాడూరు మేడిపూర్ శివాలయంలో బారులు తీరిన భక్తులు



లింగాలలోని శివాలయం దగ్గర హోమంలో పాల్గొన్న దంపతులు

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

వెల్దండ: మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం బ్రహ్మగిరి దేవాలయంలో వేదమంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, విజేందర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, జంగయ్య యాదవ్, రాజయ్య, సంతోష్, అన్నదానం కృష్ణయ్య, రామాచారి, ఆయా గ్రామాల సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.



హాజరైన నాయకులు, భక్తులు

కైలాసం గుట్టపై ధ్వజారోహణం



కల్వకుర్తి రూరల్: పట్టణ సమీపంలోని కైలాసం గుట్టపై బుధవారం సాయంత్రం కాషాయ ధ్వజాన్ని ఎగురవేశారు. అతి పురాతనమైన పలు ఆలయాల సముదాయమైన కైలాసం గుట్టపై హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో దాదాపు రూ.3 లక్షలు ఖర్చు చేసి మరమ్మతు నిర్వహించారు. ఆంజనేయ స్వామి దేవాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయంతో పాటు శివాలయం పరిసరాలను శుభ్రం చేశారు. ఆలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు.

ప్రమాదకరంగా మలుపులు

పెంట్లవెల్లి: మండల కేంద్రం నుంచి మల్లేశ్వరం, ఎంగంపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై మలుపులు ప్రమాదకరంగా మారాయి. అదేవిధంగా రహదారికి ఆనుకొని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగాయి. దీంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనం కన్పించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పెంట్లవెల్లి నుంచి మల్లేశ్వరం వెళ్లే దారిలో..

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాకేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన ఆనంద్ (40) మద్యానికి బానిసగా మారాడు. కుటుంబసభ్యులు మద్యం తాగొద్దని మందలించడంతో మనస్థాపానికి గురై వ్యవసాయ పొలంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు టీబీ నిర్ధారణపై ప్రత్యేక క్యాంపు

వీపనగండ్ల: టీబీ వ్యాధితో పాటు ఛాతి సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం గురువారం కల్వరాల, పుల్గర్‌చర్ల గ్రామాల్లో ప్రత్యేక హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. దగ్గుతో కూడిన తెమడ, రక్తం పడడం, జ్వరం, ఛాతి నొప్పి, షుగర్ వ్యాధి ఉన్నవారు ఈ క్యాంపులో పాల్గొని అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన బండారు వీరస్వామి 23వ తేదీన గ్రామం నుంచి శ్రీశైలానికి పాదయాత్రతో వెళ్తున్న వీపనగండ్ల, చిన్నదగడ శివ మాలధారులతో కలిసి వెళ్లాడు. మాలధారులు శ్రీశైల దర్శనం చేసుకొని గ్రామాలకు చేరుకున్నారని, కానీ వీరస్వామి ఇంటికి తిరిగి రాలేదని అతడి తండ్రి, తమ్ముడు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

పాలమూరులో మరో నేషనల్ టోర్నీ

- 68వ అండర్-19 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ బాలుర టోర్నీ కేటాయింపు
- ఏప్రిల్ 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహణ
- క్రీడాకారుల్లో హర్షాతిరేకాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడల నిర్వహణలో పాలమూరు జిల్లాకు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రతి ఏడాది జిల్లా కేంద్రంలో జాతీయస్థాయి క్రీడలు నిర్వహిస్తూ వస్తున్నారు. 2015లో అండర్-14 జాతీయ క్రికెట్, 2016లో అండర్-14 జాతీయ వాలీబాల్, 2017లో అండర్-14 జాతీయ నెట్‌బాల్ టోర్నీలు జరిగాయి. 2018లో ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు అండర్-17 హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి టోర్నమెంట్, అదే ఏడాది డిసెంబర్ 23 నుంచి 26వ తేదీ వరకు జాతీయస్థాయి అండర్-14, 17, 19 విభాగాల్లో టెన్నిస్ వాలీబాల్, అండర్-17, 19 విభాగాల్లో పవర్ లిఫ్టింగ్ బాలబాలికల పోటీలు నిర్వహించారు.

మూడోసారి ఎస్‌జీఎఫ్ జాతీయ టోర్నీ..

ఉమ్మడి జిల్లాకు వరుసగా మూడోసారి జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు కేటాయించారు. గతేడాది డిసెంబర్‌లో 25 నుంచి 30వ తేదీ వరకు కోస్గిలో అండర్-19 వాలీబాల్ బాలుర టోర్నీ జరిగింది. మహబూబ్‌నగర్‌లోని మెయిన్ స్టేడియంలో ఈ ఏడాది జనవరి 10 నుంచి 14వ తేదీ జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీని విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జిల్లాకు 68వ ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి అండర్-19 బాలుర క్రికెట్ చాంపియన్‌షిప్‌ను కేటాయిస్తూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో తొలిసారిగా మహబూబ్‌నగర్‌లో ఏప్రిల్ 25నుంచి 30వ తేదీ వరకు నేషనల్ ఎస్‌జీఎఫ్ అండర్-19 క్రికెట్ టోర్నీ జరగనుంది.



హాజరుకానున్న 40 రాష్ట్రాల జట్లు..

నేషనల్ అండర్-19 బాలుర క్రికెట్ చాంపియన్‌షిప్‌లో దాదాపు 40 రాష్ట్రాల జట్లు పాల్గొననున్నాయి. ఒక్కో రాష్ట్రం నుంచి బాలుర జట్టులో 16 మంది చొప్పున క్రీడాకారులు, ఒక కోచ్, ఒక మేనేజర్ రానున్నారు. జిల్లా కేంద్రంలోని ఐదు మైదానాల్లో క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మూడోసారి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఆతిథ్యం ఇస్తుండటంతో సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.